

# కథా కౌముది

## అనుకున్నదొకటి.. అయినదొకటి

- ఆంగ్లమూలం: బి.సునీత

- అనువాదం: కొల్లూరి సోమ శంకర్

సునయనకి తెలుసు తాను లంచ్‌కి వెళ్ళడం ఆలస్యమైందని. కానీ ఆమేమీ తొందరపడడం లేదు. భోజనానికొచ్చేవాళ్ళంతా మాములు వాళ్ళే, ప్రత్యేకమైన వాళ్ళెవరూ రావడం లేదు. పత్రిక రెండు సంచికలు వెలువడ్డాకా, ఎడిటోరియల్ టీంతో సంబంధాలు తెగిపోయాయి. రాబోయే సంచికల నమూనా, మాటర్ అంతా వర్కింగ్ ఎడిటర్ కంప్యూటర్‌లో ఉండిపోయింది. ప్రధాన సంపాదకుడికి, పబ్లిషర్‌కి అసలే మాత్రం పొసగడం లేదు. అయిన దానికి, కాని దానికి తెగ తగాదా పడుతున్నారు. పత్రికలో చాలా పేజీలు నిర్వహిస్తున్న రచయిత్రిగా సునయనకి పత్రిక ఆగిపోవడం బాధగా ఉంది. వాళ్ళు తనను మోసం చేసినట్లనిపించిందామెకు.

చాలా సంచికలకు సరిపోయే మాటర్‌ని ముందుగానే పత్రికాఫీసులో ఇచ్చేసింది. వాటిని చాలా కష్టపడి రాసింది. అదో కొత్త పత్రిక. కంటెంట్ విషయంలోను, టాపిక్‌లను ఎంపికచేయడంలోను ఆమెకి స్వేచ్ఛ ఎక్కువ ఇచ్చారు. ఆమె సూచించిన మార్పులు చేర్పులను ఆమోదించారు. పైగా ఆమె సూచనలని ఎంతో గౌరవంతో పాటించేవారు. కాకపోతే, ప్రధాన సంపాదకుడే కొంచెం అంటీముట్టనట్టుగా ఉండేవాడు. సునయన ఉత్సాహం ఆయనకి నచ్చేది కాదు. కానీ పబ్లిషర్‌కి మాత్రం సునయన పని బాగా నచ్చేసింది, ఆమెని ఎడిటోరియల్ టీంలోకి తీసుకోవాలనుకున్నాడు. అందుకే సునయన వీలైనంత ఉత్తమ రచనలు అందించేందుకు ప్రయత్నించేది. ఎందుకంటే ఇది ఆమె మొదటి పూర్తిస్థాయి ఉద్యోగం!

మొదటి రెండు సంచికల్లోనూ ఆమె రచనలు ప్రచురించారు. తర్వాతే పత్రిక ఆగిపోయింది! ఎన్నిసార్లు అడిగినా ఇప్పటిదాకా పారితోషకం ఇవ్వలేదు. పైగా పేజీల కొద్దీ శ్రమ కోల్డ్ స్టోరేజ్‌లో మగ్గుతుండడంతో సునయన మరింత నిరాశకి గురైయింది. అలాంటి స్థితిలో రమేష్ ఫోన్ వచ్చింది!!!

"రేపు స్వాగత్‌లో లంచ్‌కి రాగలరా?" అడిగాడు. సునయనకి ఎక్కడో ఏదో కొద్దిపాటి ఆశ...! రమేష్ ప్రచురణకర్త! బహుశా తన రచనలకి పేమెంట్ ఇస్తాడేమో? లంచ్‌కి ఎవరెవరు వస్తున్నారని అడిగింది. ప్రత్యేకమైన వాళ్ళెవరూ లేరని రమేష్ అన్నాడు. 'మనమే' అన్నాడు. సునయనకి నమ్మకం కలిగింది. మనమే అంటే ఎడిటోరియల్ టీం కూడా అనుకుంది. 'బావుంది' అని తనకి తాను చెప్పుకుంది.

లంచ్ కోసం ప్రత్యేకంగా తయారవలేదు. ఫార్మల్‌గా ఉండే ఎరుపు, క్రీం రంగు చీర కట్టుకుంది. మెడలో ముత్యాల దండ వేసుకుంది. ఈ లంచ్ మాములుది కాదు! హోటల్ మెట్లు ఎక్కుతూ, గుమ్మం దగ్గర అద్దంలో తన జడని ఒకసారి చూసుకుంది. జుట్టు

సరిచేసుకుంది. "ఫర్వాలేదు, బాగానే ఉన్నాను" అని అనుకుంది. మెట్లు దిగుతున్న ఓ యువకుడు ఆమెని చూసి చిన్నగా నవ్వి వెళ్ళిపోయాడు. సునయనకి సంతోషం కలిగింది.

స్వాగత్‌లో ఇంతకుముందెప్పుడు సునయన భోజనం చేయలేదు! నగరంలోని ఖరీదైన రెస్టారెంట్లలో అదొకటి. సునయన కలిసి తిరిగే మధ్యతరగతి మనుషులెవరూ ఇక్కడ తినుండరు, కనీసం ఈ హోటల్ వైపు చూసుండరు. గుమ్మం దగ్గర తెలుపు, బంగారు రంగు తలపాగా ధరించిన గేట్‌కీపర్ తలొంచి అభివాదం చేసాడు. ఆమెని ఓ సారి పరిశీలించి, 'అక్కడ మేడం' అంటూ రెండు టేబుళ్ళ అవతలకి వేలు చూపించాడు. తలపాగా వెనక నుంచి, దీపాలు మంద్రంగా వెలుగుతున్న ఓ చిన్న క్యాబిన్ నుంచి రమేష్ పలకరింపుగా చెయ్యి ఊపాడు.

ఎండలోంచి, ఈ గదిలోకి అడుగుపెట్టేసరికి ఎంతో చల్లగా అనిపించింది. హోటల్‌లోని వెలుతురికి అలవాటు పడేసరికి, ఆ క్యాబిన్‌లో ఇంకొక ఖాళీ టేబుల్ మాత్రమే కనిపించింది. పైగా అక్కడ రమేష్ తప్ప మరెవరూ లేరు. మిగతా వాళ్ళంతా ఏమయ్యారు?

వెయిటర్ టేబుల్ దగ్గరే తచ్చాడుతున్నాడు. రమేష్ ముందొక మెనూ కార్డు ఉంది. బహుశా అందరు వచ్చేవరకు ఆర్డర్ ఇవ్వకుండా ఆగాడేమో.

"జ్యూస్ ఏదైనా తీసుకుంటారా సునయనా?"

సునయనకి ఆశ్చర్యం వేసింది. అప్పటికే రెండయ్యింది, పైగా ఆమెకి బాగా ఆకలేస్తోంది. ఇప్పుడు జ్యూసా? అంటే భోజనం రావడానికి ఇంకా టైం ఉందన్న మాట! అయితే తప్పేదేముంది అని అనుకుంది.

"సరే. పైనాపిల్ జ్యూస్ తాగుదాం"

రమేష్ వెయిటర్‌కి సైగ చేసాడు. అతడు వెళ్ళగానే వాళ్ళిద్దరే మిగిలారక్కడ. ఇంతలో రమేష్ సెల్ మోగింది. 'ఒక్క నిముషం' అని సైగ చేసి, లోగొంతుకతో మాట్లాడసాగాడు. సునయన మెనూ కార్డు తీసుకుని ఐటమ్స్ పరిశీలించసాగింది.

ధరల పట్టిక చూస్తూ, ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పైనాపిల్ జ్యూస్ 75 రూపాయలు. 'అయ్యబాబోయ్..' అనుకుంది.

"డాలర్లలోకి మారిస్తే దాదాపు 2 డాలర్లు అంతే. పర్వాలేదు..." అనుకుంది. ఈ మధ్యే ఓ అవుట్ సోర్సింగ్ కంపెనీలో చేరింది సునయన. ప్రతీసారి రూపాయలని, డాలర్లతో పోల్చుకోవడం అలవాటయ్యింది.

మెనూకార్డ్ ఆసక్తిరకంగా ఉంది. స్టార్టర్స్ అనీ అదిరిపోయే ఖరీదు. కొన్ని పదార్థాలకి - డ్రాప్ డౌన్స్, స్వీట్ పీస్ లాంటి తమాషా పేర్లు ఉన్నాయి. ఇక మెయిన్ డిష్‌లు వివరాలు చదువుతుంటేనే నోరూరుతుంది. అయితే వాటి రేట్లే గూబ గుయ్యమనిపించేటట్లున్నాయి. డెసర్ట్‌ల పేజీ తిప్పింది. అక్కడున్న బొమ్మలని గబగబా పరిశీలించింది. ఐస్‌క్రీం ఆమె బలహీనత. అక్కడున్న ఐస్‌క్రీంల జాబితా అద్భుతం, అత్యంత ఖరీదైనవి!

పత్రిక ఆర్థికపరమైన ఇబ్బందులలో ఉంటే రమేష్ ఇంత ఖరీదైన హోటల్లో భోజనం ఎందుకు పెట్టుకున్నాడో అర్థం కాలేదామెకి. 'కాఫీ హౌస్ అయితే సరిపోయేది' అని అనుకుంది.

రమేష్ ఫోన్లో మాట్లాడడం ముగిసింది. కుర్చీలో వెనక్కి జారి, "ఇంకేంటి సంగతులు సునయనా?" అని అడుగుతూ సెల్ స్విచ్ ఆఫ్ చేసాడు.

"ప్రత్యేకమైన విశేషాలేవీ లేవు. ఎప్పుడు ఉండే రొసెర్చే. మీ విషయాలేంటి?" అతడు సెల్ స్విచ్ ఆఫ్ చేయడం గమనించింది. ఏం చెపుతాడో అనుకుంది.

"హా!చ్. ఆం హమ్....! అన్నీ కష్టాలే సునయనా.... మీకు తెలియనది ఏముంది? ఈ రోజుల్లో నాకన్నీ సమస్యలే... వాటిల్లో కొన్ని మీకూ తెలుసు" అంటూ రమేష్ పళ్ళికిలించాడు.

సునయనకి ఇబ్బందిగా అనిపించింది. మిగతా వాళ్ళేరన్న ప్రశ్న ఆమె బుర్రని తొలిచేస్తోంది.

కాసేపటికి వెయిటర్ జ్యూస్‌తో తిరిగొచ్చాడు. చల్లటి, చిక్కటి పసుపు పచ్చ పైనాపిల్ జ్యూస్! గ్లాసు చివర్లలో సన్నగా తురిమిన అనాసపండు ముక్కలు అమర్చారు. 'మంచి సర్వీసు' అనుకుంది సునయన. వాచ్‌కేసి చూసుకుంది. రెండుంపావు అవుతోంది. హఠాత్తుగా ఆమెకి గుర్తొచ్చింది... రమేష్ తన సెల్ స్విచ్ ఆపేసాడని. మరి మిగతా వాళ్ళతో ఎలా మాట్లాడడం? వాళ్ళు వస్తున్నారో లేదో ఎలా తెలుస్తుంది?

"రమేష్, మిగతావాళ్ళేరి? ఆలస్యంగా వస్తారా? నాకంత టైం లేదు. నేను వెయిట్ చేయలేను. మూడున్నర - నాలుగు మధ్యలో నేను లైబ్రరీకి వెళ్ళాలి"

రమేష్ చిన్నగా నవ్వాడు. లోగొంతుకతో - 'మిగతావాళ్ళంటే...?' అని అడిగాడు.

"ఎడిటోరియల్ టీంలోని మిగతావాళ్ళు - జయంత్, బ్రిజేష్, అనుపమ....."

"వాళ్ళెవరని పిలవలేదు సును..., ఓ...సారీ...నిన్ను సును అని పిలవచ్చా? సునయన అన్నది మంచి పేరే అనుకో. కానీ పిలవడం కష్టం. అయినా నేను నీకు వాళ్ళందరిని పిలుస్తున్నట్లు చెప్పలేదే?"

అతడు ఏకవచనంలోకి దిగడం గమనించింది.

"అవును. వాళ్ళెవరిని పిలుస్తున్నట్లు మీరు చెప్పలేదు. ప్రత్యేకమైన వాళ్ళెవరూ లేరని అన్నారు. ఇక రెండో దానికి వీల్లేదు... నన్ను సును అని పిలవడానికి వీల్లేదు.. అలా నన్ను పిలవడం నాకిష్టం ఉండదు"

"నేను 'మనం' అని చెప్పాగా?"

"మనం అని మాత్రమే అన్నారు. మనమిద్దరమే అని అనలేదు"

"మై గర్ల్, నువ్వు బాగా కన్‌ఫ్యూజ్ అయినట్లున్నావు"

సునయన ఆగ్రహంతో ఉడికిపోయింది. కానీ కోపాన్ని ఆపుకుంది. 'నన్ను మై గర్ల్ అని పిలవడంలో వీడి ఉద్దేశ్యమేంటి? పైగా ఏకవచనం ఒకటి..' అని అనుకుంది. ఇలాంటి పరిస్థితులలో ఎలా ప్రవర్తించాలో ఆమెకి బాగా తెలుసు. చిన్నప్పటి నుంచి కో - ఎడ్యుకేషన్ స్కూలు, కాలేజీలలో చదివింది.

"రమేష్, నన్ను మీరు అని పిలవండి. 'నువ్వు' అని కాదు." అని చెప్పి, "ఇంతకీ అడగడం మర్చిపోయాను. ఈ మధ్యే పుట్టిన మీ చంటి పాప ఎలా ఉంది? ఆ అమ్మాయికి పేరు పెట్టారా?" అని అడిగింది.

ఊహించని ఈ ప్రశ్నకి రమేష్ ఖంగుతిన్నాడు. అతడి ముఖంలోంచి నవ్వు మాయమైంది. పాప ప్రసక్తి వచ్చేసరికి ఇల్లు గుర్తొచ్చి వాస్తవం స్ఫురించింది.

"పాప బానే ఉంది. ఇంకా పేరు పెట్టలేదు. మా ఆవిడ పాత చింతకాయ పచ్చడి లాంటి దేవతల పేర్లు పెడదామంటుంది. నేనేమో సునయన లాంటి తియ్యటి పేరు పెడదామంటాను"... అంటూ పళ్ళికిలించాడు.

ఒక్క క్షణం ఆమెకి ఏమనాలో తోచలేదు. ఏదైనా సాకు చెప్పి అక్కడి నించి వెళ్ళిపోవాలా లేక ఇప్పటి దాకా రాని పారితోషకం గురించి అడగాలో ఆమె తేల్చుకోలేకపోయింది. ఎందుకంటే ఈ సంభాషణ మరో వైపు మళ్ళడానికి వీల్లేదు. 'జాగ్రత్తగా ఉండాలి' అని అనుకుంది.

"సరే, ఇంతకీ నన్నెందుకు ఇక్కడికి రమ్మన్నారు? పత్రిక మళ్ళీ ప్రారంభిస్తున్నారా?"

"ఆలోచనైతే ఉంది, కానీ ఆ జయంత్ ఉన్నాడే... నా బుర్ర తినేస్తుంటాడు.... వాడే లేకపోతే నిన్నే ఎడిటర్ చేసేసి ఉండేవాడిని.... అది సరే, సును ఇవాళ నువ్వు చాలా బావున్నావు..."

"సునయన... రమేష్..! నన్ను 'సును' అని పిలవద్దు. మా పాత ట్యూషన్ మాస్టరొకాయన అలా పిలిచేవాడు. కానీ ఆయనంటే మాకెవరికి ఇష్టంలేదు. పైగా మీరు నన్ను 'నువ్వు' అని పిలవడం బాలేదు. మీ ఆర్ధిక సమస్యలు తీరాయా? ఎందుకంటే పత్రిక మూసేయడానికి డబ్బే ప్రధాన కారణమని విన్నాను"

"అవును. అది కూడా ఒక కారణం. అయితే పత్రికని మరో సంవత్సరం పాటు నడపగలిగేందుకు కావల్సిన ఆధారం దొరికింది. కానీ వచ్చిన చిక్కల్లా ఆ జయంత్ తోటే. జీతం పెంచమని తెగ గొడవ చేస్తున్నాడు. ఎంత నచ్చజెప్పినా వినడం లేదు. గత ఆరు నెలల్లో నా దగ్గర నుంచి డబ్బు గుంజడమే తప్ప ఆయన చేసిందేమీ లేదు. డబ్బులు ఇవ్వడం మానేస్తే నన్ను నానా మాటలు అన్నాడు..."

"నాతో పాటు మిగతా వాళ్ళెవరికి కూడా మీరు డబ్బులివ్వలేదు రమేష్"

"ఇద్దామనే ఉంది సును.... సారీ సునయనా. కాని మీకు తెలియనిదేముంది? అందుకు మా ఆవిడ నగలు కావాలి. వాటిని తాకట్టు పెట్టి డబ్బు తేవాలని నా ఆలోచన! కానీ మా ఆవిడ అందుకు ఒప్పుకోవడం లేదు. పైగా ప్రస్తుతం నాకు ఆవిడకి మాటలు సరిగా లేవు" అని చెప్పి కొంచెం స్వరం తగ్గించి, "ఆమెని ఒప్పించడానికి ఇంకొంత సమయం పడుతుంది సునయనా, మీరు మరికొన్ని రోజులు ఆగాల్సి ఉంటుంది..." అంటూ మృదువుగా చెప్పాడు.

ఇంతలో వెయిటర్ వచ్చి ఆమె ముందు మెనూ కార్డు పెట్టాడు క్షణాల్లో ఆమె ఒక నిర్ణయం తీసుకుంది.

"రమేష్, ఆర్డర్ చేద్దామా? నాకు బాగా ఆకలిగా ఉంది"

"అరె, సారీ, నేనెంత మూర్ఖుడిని. భోజనానికి పిలిచి వెయిట్ చేయిస్తున్నాను... ఆర్డర్ ఇవ్వండి. ఇంతకు ముందు మీరెప్పుడైనా ఈ హోటల్‌కి వచ్చారా? లేకపోతే ఆర్డర్ నేను చెప్పనా?"

"ఇంతకు ముందెప్పుడు ఈ హోటల్‌కి నేను రాలేదు. కానీ ఆర్డర్ ఇవ్వడానికి నేనేమీ భయపడను..." అంటూ గులాబీరంగు వేసుకున్న గోళ్ళతో మెనూ కార్డులో పేజీలు తిప్పి, ధరలు పోల్చుకుంటూ ఐటమ్స్ ఆర్డర్ ఇచ్చింది. వెయిటర్ ముఖంలో ఆమె పట్ల గౌరవం కదలాడింది. కనుల చివరి నుంచి రమేష్‌ని గమనించంది. అతడి ముఖం పాలిపోయింది, అయినా మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తున్నాడు. పర్సు తెరిచి క్రెడిట్ కార్డు ఉందో లేదో చూసుకుని, అది ఉండడం గమనించి అమ్మయ్య అని అనుకున్నాడు.

భోజనం బ్రహ్మాండగా ఉంది. తృప్తిగా తిన్న సునయనకి త్రేన్పు వచ్చింది, కానీ మర్యాద కోసం గొంతు దగ్గర చెయ్యి అడ్డం పెట్టుకుని ఆపుకుంది. రమేష్ సరిగా తినలేదు. ఏదో నాలుగు మెతుకులు గతికి భోజనం అయిందనిపించాడు. సునయన అతడి తిండిపై హాస్యమాడింది. వెయిటర్ మళ్ళీ ప్రత్యక్షమై మెనుకార్డు సునయన ముందు పెట్టాడు.

"ఏదైనా డెసర్ట్ మేడమ్?" అని అడిగాడు.

"సునయనా, మీరు తీసుకోరు కదూ, నాకు గుర్తుంది..." అంటూ మెనూ కార్డుని వెయిటర్ వైపు తోసాడు రమేష్.

"మాదింతే. ఆమె డైటింగ్‌లో ఉంది. ఇంకేమీ తినదు...."

వెయిటర్‌కి చికాకేసింది, కానీ తాను తీసుకున్న శిక్షణ వలన ఏ భావం వ్యక్తం చేయకుండా తనని తాను అదుపులో ఉంచుకుని అక్కడి నుంచి తప్పుకున్నాడు సునయన ఏమీ అనలేక, పేలవంగా నవ్వింది.

ఫింగర్ బౌల్స్, సోంపు వచ్చాయి. బిల్లు వచ్చాక, భోజనానికయిన ఖర్చుని గమనించింది సునయన. ఆ మొత్తాన్ని చూసిన రమేష్ ముఖంలో రంగు మారింది. బుగ్గల దగ్గర ఎర్రబడింది. పర్సు తెరిచి క్రెడిట్ కార్డుని వేలితో జాగ్రత్తగా పట్టుకుని డబ్బులు లెక్కబెడుతున్నాడు. సునయన, వెయిటర్ ఉబికివస్తున్న నవ్వుని దాచుకుంటూ కుట్రదారుల్లా ఒకరికేసి మరొకరు చూసుకున్నారు.

"రమేష్ ఉండండి. ఇవాళ ఎందుకో నాకు స్వీట్ తినాలనిపిస్తోంది..." అంటూ వెయిటర్ కేసి తిరిగి "ఒకసారి మెనూ కార్డు తెస్తారా, ప్లీజ్?" అని అడిగింది. చక్కగా అలంకరించి తెచ్చిన గోల్డెన్ ట్రియో ఐస్క్రీం, ఫ్రూట్ కుల్ఫీ ఎంతో రుచిగా ఉన్నాయి. వాటిని తినడం పూర్తిచేసాకా, బిల్స్ అన్నీ పిన్ చేసి రమేష్ ముందించిన సమయానికే సునయన సెల్ మోగింది.

"ఆఁ దీప్తి, అలాగా, వచ్చేస్తున్నా. ఇంకో అయిదునిముషాలలో అక్కడుంటా. నేను రాకుండా వెళ్ళద్దే.." అంటూ సెల్ ఆపేసి, రమేష్ వైపు తిరిగింది.

"రమేష్, నేనింక వెళ్ళాలి. ఇంత చక్కటి భోజనానికి థాంక్స్. మీ ఆవిడని అడిగానని చెప్పండి. చెపుతారు కదూ. బై. నేను త్వరగా వెళ్ళాలి" అంటూ అక్కడి నుంచి కదిలింది.

తన వెనుకగా స్వింగ్ డోర్ మూసుకుంటే రమేష్ ముఖం కనిపించింది. పాలిపోయిన ఆ ముఖం చాలామెకు తాను కీలెరిగి వాతపెట్టానని గ్రహించడానికి.

ఆ రాత్రి తన డైరీలో ఆ తేదీలో రెండే పదాలు రాసుకుంది - బాకీ - చెల్లు!

✡ ✡ ✡



కొల్లూరి సోమశంకర్‌గారు హైదరాబాదులో ఒక స్వచ్ఛంద సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. 2001 నుంచి కథలు వ్రాస్తున్నారు. సొంతంగా వ్రాయడమే కాక మంచి కథలు ఎక్కడ చదివినా, వాటిని తెలుగులోకి అనువాదం చేస్తుంటారు. 2006లో మనీప్లాంట్ అనే కథా సంకలనాన్ని, 2004లో మరో ముగ్గురు మిత్రులతో కలిసి 4 X 5 అనే కథా సంకలనాన్ని వెలువరించారు. పలు పత్రికల్లో వివిధ శీర్షికల్ని నిర్వహించారు, నిర్వహిస్తున్నారు.

సునీతగారు త్రివేంద్రంలో నివసిస్తున్నారు. మళయాళంలోనూ, ఇంగ్లీషులోనూ కూడా కథలూ, కవితలూ వ్రాస్తుంటారు. ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా పనిచేస్తున్న సునీత గారు రెండు భాషల్లోకీ అనువాదాలు కూడ చేస్తున్నారు.